క్లుప్తంగా

వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులుగా పిట్ల శ్రీధర్



బాన్సువాడ రూరల్: వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడిగా బాన్సువాడకు చెందిన పిట్ల శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు, జాతీయ గౌరవ అధ్యక్షులు లోకనాథం తెలిపారు. ఈమేరకు పిట్ల శ్రీధర్ మాట్లాడుతూ.. తాను వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్పించడానికి జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామన్నారు. స్థానిక ఎన్నికల్లో వడ్డెరలు పోటీచేసి గెలుపొందాలంటే మనలో ఐక్యత ఎంతో అవసరమన్నారు. త్వరలో తెలంగాణ వ్యాప్తంగా వడ్డెరల ఉద్యమ చైతన్య యాత్ర నిర్వహిస్తానన్నారు.

తిమ్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సాయిలు

ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సాయిలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం తెలిపారు. గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉపాధ్యక్షుడిగా ప్రకాష్, కార్యదర్శిగా శివప్రసాద్, కోశాధికారిగా రత్నయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. అనంతరం ఆయనకు నాయకులు అభినందనలు తెలిపారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులున్నారు.

బాలవికాస్ కమిటీ కార్యవర్గం ఎన్నిక

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్‌లో వీడీసీ ఆధ్వర్యంలో శుక్రవారం బాలవికాస్ నీటిశుద్ధి కేంద్రం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొక్కరాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సయ్య, కార్యదర్శిగా చిన్న గంగారెడ్డి, కోశాధికారిగా శ్రీధర్‌రావు, డైరెక్టర్లుగా అమృత్‌రెడ్డి, దేవిరెడ్డిభాగవ్వ, జగన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. వీడీసీ చైర్మన్ ఏనుగు మోహన్‌రెడ్డి, కార్యదర్శి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు బెంచీల విరాళం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇన్ఫినిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కంపెనీ ఇనుపగేటు,విద్యార్థుల కోసం 100 బెంచీలను విరాళంగా అందజేసింది.ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్ఫినిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులు శ్రీవారి చంద్రశేఖర్, శ్రీవారి భారతి, కామారెడ్డి బ్రాంచ్ మేనేజర్ నరేష్, మహేందర్‌లను అమ్మ ఆదర్శ పాఠశాలకమిటీ చైర్మన్ భారతి, హెడ్‌మాస్టర్ బలరామ్‌లు సన్మానించారు.

వీర హనుమాన్ ఆలయానికి సహాయం అందించాలి



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని సంతోషి మాత ఆలయ ఆవరణలోని శిథిలావస్థకు చేరిన వీర హనుమాన్ ఆలయ పునర్నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వీర హనుమాన్ ఆలయ నూతన నిర్మాణ పనుల కోసం పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి సుమారు రూ.25 లక్షల వరకు ఖర్చవుతుందని భక్తులు, గ్రామస్తులు ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కమిటీ సభ్యులు మనవి చేశారు. మండల కేంద్రానికి చెందిన సంతోష్ మేస్త్రీ ఆలయ నిర్మాణం కోసం రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు.

రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

బీబీపేట: రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని ఏడీఏ అపర్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీ ఫిజికల్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందాలంటే కచ్చితంగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు.రైతులు ఆయా పరిధిలో ఉన్నటువంటి రైతు వేదికల వద్దకు వెళ్లి వ్యవసాయ అధికారులతో ఈ రిజిస్ట్రీ చేసుకోవాలని తెలిపారు. ఏవో నరేందర్, ఏఈవోలు సంతోష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలో శనివారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పర్యటించనున్నారని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దర్పల్ గంగాధర్ తెలిపారు. బిచ్కుంద మున్నూర్ కాపు సంఘంలో కొత్త రేషన్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఎల్లారం తండాలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం, పెద్ద ఎక్లార, వజ్రఖండిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం, జుక్కల్‌లో ఇందిరా మహిళా శక్తి సంబురాలు, పెద్దకొడప్‌గల్‌లో వన మహోత్సవం కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

దోమకాటుకు పల్లెలు విలవిల

- మూలనపడ్డ ఫాగింగ్ మిషన్‌లు
- పల్లెల్లో కానరాని ఫాగింగ్
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణకు జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్‌లు చాలా పంచాయితీల్లో చెడిపోగా, మరికొన్ని గ్రామ పంచాయితీల్లో మిషన్‌లు మాయమయ్యాయి. జిల్లాలో దోమకాటుకు పల్లెలు విలవిలలాడుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు ఇతర వైరల్ జ్వరాలు తాండవం చేస్తున్నాయి. దోమల నివారణకు కొనుగోలు చేసిన యంత్రాలు పంచాయతీల్లో లేకపోవడం గమనర్హం. జిల్లాలో అప్పటి ప్రభుత్వం ఒక్కో యంత్రానికి రూ.35 వేల నుంచి రూ.40 వేలు వెచ్చించి కొనుగోలు చేసింది. మిగతా గ్రామాల్లో మేజర్ పంచాయతీల నుంచి అడపాదడపా తీసుకుని పారిశుద్ధ్య కార్మికులు ఫాగింగ్ చేస్తున్నారు. మరికొన్ని పంచాయతీల్లో యంత్రాలు మాయం కావడంతో పక్క పంచాయతీల నుంచి తీసుకురావల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవల 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయించాలని అధికారులు సూచనలు చేస్తున్నప్పటికి పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. డీజిల్, పెట్రోల్, లిక్విడ్‌లను సమపద్ధతుల్లో వినియోగించకపోవడం వల్ల యంత్రాలు చెడిపోయినట్లు తెలుస్తోంది. వాటి కోసం ఖర్చులు చేస్తున్నట్లు బిల్లులు రాసుకోవడం మాత్రం ఏ ఒక్క నెల ఆగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మరమ్మతులకు నోచుకోని ఫాగింగ్ మిషన్

మరమ్మతులకు ఖర్చు తడిసి మోపెడు..

మండలంలోని చాలా గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు మరమత్తులు చేయించలేక మూలన పడేశారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. చెడిపోయిన యంత్రాలకు మరమ్మతులు చేయించాలంటే డబ్బులు చాలా ఖర్చు అవుతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు.

ఫాగింగ్ చేయకుండానే..

గ్రామ పంచాయతీల్లో వారంలో రెండు సార్లు ఫాగింగ్ చేపట్టాల్సి ఉంటుంది. వర్షాకాలం సీజన్ ప్రారంభంలో వీటి వినియోగం మరింత ఎక్కువ చేసినప్పుడే దోమలను సగం వరకు నియంత్రణ చేయవచ్చు. గ్రామం మొత్తంగా నెలలో ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయడం లేదు. ఒకసారి పిచికారీ చేసిన సమయంలో తీసిన ఫోటోలనే ప్రతి నెలా వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టక పోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.

మిషన్‌లతోనే పిచికారీ



ప్రతి గ్రామంలో దోమల నివారణ కోసం దోమల మందును పిచికారీ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తున్నాం. వ్యాధుల తీవ్రత దృష్ట్యా పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

–సంతోష్ కుమార్, ఎంపీడీవో, సదాశివనగర్

హక్కుల సాధనకు చైతన్యవంతుల్ని చేయాలి

కామారెడ్డి అర్బన్: గిరిజనుల హక్కుల కోసం నిరంతరం చైతన్య పరచాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రాణా ప్రతాప్ రాథోడ్‌పిలుపునిచ్చారు. సమితి కామారెడ్డి మండల సమావేశం జిల్లా అధ్యక్షుడు సునావత్ గణేష్‌నాయక్ అధ్యక్షతన ఉగ్రవాయి మైసమ్మ ఆలయం వద్ద జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రాణా ప్రతాప్ రాథోడ్ హాజరయ్యారు. సమితి కామారెడ్డి మండల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా విస్లావత్ గోపి నాయక్, గౌరవ అధ్యక్షుడిగా మోతీరాం, ప్రధాన కార్యదర్శిగా భూక్యా శ్రీను నాయక్, ఉపాధ్యక్షుడిగా విస్లావత్ దామ్లా, కార్యదర్శులుగా రాందాస్, శర్మన్, యూత్ అధ్యక్షుడిగా భూక్యా గోవింద్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా పిర్యా, వర్కింగ్ అధ్యక్షుడిగా గోవింద్, తదితరులు ఎన్నికయ్యారు.



లంబాడా హక్కుల పోరాట సమితి కార్యవర్గం

అధికారులు స్పందించారు



తొలగించక ముందు

గడ్డి తీగలను తొలగించిన తర్వాత

సాక్షి ఎఫెక్ట్..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ గ్రామ శివారు 44వ జాతీయ రహదారి పక్కన విద్యుత్ స్తంభాలకు గడ్డి తీగలు అల్లుకొని పోయిన విషయాన్ని శుక్రవారం 'అల్లుకున్న నిర్లక్ష్యం' అనే శీర్షికన సాక్షిలో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు ట్రాన్స్ కో అధికారులు స్పందించి తీగలకు అల్లుకున్న పిచ్చి మొక్కలను తొలగించారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్

కామారెడ్డి టౌన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పజలను మోసం చేసిందని, ప్రజలకు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. హడావుడిగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటూ మరోసారి దొంగ నాటకానికి తెరలేపారని విమర్శించారు. తక్షణమే నాయకులు ప్రజల్లో ఉండాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి,నాయకులు మిన్కూరి రాంరెడ్డి, గోపిగౌడ్, కుంబాల రవియాదవ్, బాను,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్

ప్రమాదకరంగా ఓవర్ హెడ్ ట్యాంకు



నస్రుల్లాబాద్: మిర్జాపూర్‌లో ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా మారింది. వాటర్ ట్యాంకు నిర్మించి దశాబ్దాలు గడవడంతో ప్రమాదకరంగా ఉందని, నీరు లీక్ అవుతుందని ఉపయోగించకుండా వదిలేశారు. కానీ నివాస గృహాల మధ్యలో ఉండటంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారుల స్పందించి ట్యాంకును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బట్టుతండాలో కొయ్యల రవిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్



రాజంపేటలో బూసం సింహంను పరామర్శిస్తూ..

రామారెడ్డి/రాజంపేట: రామారెడ్డి మండలంలోని బట్టు తండాలోని బీఆర్ఎస్ కార్యకర్త కొయ్యల రవి తండ్రి, రాజంపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బూసం సింహం తండ్రి చనిపోవడంతో బాధిత కుటుంబాలను కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ శుక్రవారం పరామర్శించారు. అండగా ఉంటానని కార్యకర్తలకు భరోసా కల్పించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి మనోధైర్యాన్ని అందించారు.

లింగంపేటలో ఆధార్ కేంద్రం ప్రారంభించండి




మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఎల్లారెడ్డి, కామారెడ్డి, తాడ్వాయి మండలాలకు వెళ్లి రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లా నాయకులు మురళి, రాంచందర్, శివయ్య, శ్రీకాంత్, ఎల్లేశం, మాసుల శ్రీనివాస్, శుభాష్, సాయిలు, అల్లూరి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారుమడిని రక్షించుకోవడానికి రైతుల కష్టాలు



సుమారు 1.5 కిలో మీటర్ల దూరం బావి నుంచి పైప్‌లైన్ ద్వారా నారుమడికి నీళ్లు అందజేస్తున్న రైతు జాన్



గోకుల్‌తండాలో ఎండిపోయిన వరి పంట

- ముఖం చాటేసిన వర్షాలు
- ఎత్తిపోతున్న బోరుబావులు

రామారెడ్డి: ఈ ఫోటోలో కనిపిస్తున్న రైతు లావడియా జాన్‌కు రామారెడ్డి మండలంలోని గోకుల్‌తండాలో 3 ఎకరాల భూమి ఉంది. ఇటీవల నారు పోశాడు. నారుమడికి నీళ్లను పెట్టడానికి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బావి నుంచి పైపులైన్ ద్వారా నీళ్లు అందించి నారు మడిని రక్షించుకుంటున్నాడు. వర్షాలు పడితే నాట్లు వేస్తామని జాన్ చెబుతున్నాడు. మే నెలలో కురిసిన వర్షాలు జూన్ జూలై నెలలో ముఖం చాటేయడంతో బోరు బావులు ఎత్తిపోతున్నాయి. జూలై నెల గడిచిపోతున్నా వరుణ దేవుడు కరుణించకపోవడంతో రైతులు దీనంగా ఆకాశం వైపు చూస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలి



లింగంపేట అటవీ ప్రాంతంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, అధికారులు

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

లింగంపేట(ఎల్లారెడ్డి): అటవీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు మొక్కలు, వాతావరణ మార్పులు, చెట్ల ప్రాముఖ్యతపై విరివిగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం సమీపంలోని బిందిప్పల్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమవంతుగా ఒక మొక్క నాటి సంరక్షించాలన్నారు. అడవులపైనే మానవుని మనుగడ ఆధారపడి ఉందన్నారు. చెట్లు ఉంటేనే సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. లేదంటే కరువు కాటకాలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అనంతరం అటవీ ప్రాంతంలో 130 మొక్కలు నాటారు. బాన్సువాడ ఎఫ్‌డీవో సునీత, ఎఫ్ఆర్‌వోలు చరణ్, వాసుదేవ్, హిమచందన్, శ్రీనివాస్, డీఆర్‌డీవో సురేందర్, ఎంపీడీవో నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయండి

రాజంపేట: పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో బాలకృష్ణకు ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్లు ప్రవీణ్ కుమార్, చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. వారం రోజులలో తమకు వేతనాలు రాకుంటే ఉద్యోగాలకు రాజీనామా చేస్తామని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఒక్కో ఆపరేటర్‌కు రూ.22,750కి బదులుగా రూ.19,500 ఖాతాలలో జమ చేస్తున్నారని అన్నారు. వేతనం తగ్గించి అందించడం వల్ల తాము ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోయారు. అలాగే గత నాలుగు నెలల వేతనం చెల్లించాలని కోరారు.



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

ఎల్లారెడ్డిరూరల్: ఈ– కంప్యూటర్ ఆపరేటర్లకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ వారు శుక్రవారం ఎంపీడీవో ప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. శనివారం నుంచి విధులకు గైర్హాజరవుతామని వారు పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు అనిల్, కపిల్, ప్రశాంత్ తదితరులున్నారు.

బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



బ్యాంకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ విఠల్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: ప్రతి బ్యాంకుల్లో వీలైనంత ఎక్కువ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి పట్టణంలోని బ్యాంకు అధికారులకు సూచించారు. బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలు తమ కష్టార్జితాన్ని మీ వద్ద దాచుకుంటారని, దానికి భద్రత ఇవ్వాల్సిన బాధ్యత బ్యాంకర్లదేనన్నారు. బ్యాంకులోపలే కాకుండా బ్యాంకు చుట్టూ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. ఏటీఎంలలో అవసరానికి మించిన డబ్బులు నిల్వ ఉంచరాదన్నారు. బ్యాంకు నుంచి డబ్బులు డ్రాచేయగానే ఎక్కడా ఆగకుండా నేరుగా ఇంటికి వెళ్లిపోవాలన్నారు. ఏటీఎంలలో డ్రా చేసే వారు తమ వెంట మరొకరిని తీసుకుని రావాలన్నారు. పట్టణ సీఐ అశోక్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మసీదుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



గాంధారి: ప్రారంభిస్తున్న ఎస్సై ఆంజనేయులు

గాంధారి(ఎల్లారెడ్డి): దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని రెండు మసీదుల్లో ముస్లింలు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మసీదుల్లో సొంత డబ్బులతో కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఏదైనా నేరం జరిగితే సీసీ కెమెరా పుటేజీల ద్వారా నిందితులను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. నాయకులు ముస్తఫా, మదార్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు



రాజంపేట:వర్షాలు కురవాలని కోరుతూ రాజంపేట మండల కేంద్రంలో గ్రామస్తులు శుక్రవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పెద్దమ్మ ఆలయం నుంచి మహిళలు నీటి బిందెలతో ఊరేగింపుగా వెళ్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో లింగాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

శాకంబరి భవానీ మాతకు విశేష పూజలు



కామారెడ్డి అర్బన్: స్థానిక పశ్చిమ హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీసంకష్టహర గణపతి ఆలయంలోని శ్రీభవానీ అమ్మవారిని ఆషాఢ శుక్రవారం సందర్భంగా శాకంబరిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. వేదపండితులు అంజనేయశర్మ, అర్చకులు యజ్ఞం సంపత్ కుమార్ శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు కాలనీ వాసులు, భవానీ మాత సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్ స్కూల్‌లో శుక్రవారం బోనాల పండుగను నిర్వహించారు. చిన్నారులు, టీచర్లు బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. మొక్కులను తీర్చుకున్నారు. అలాగే మున్సిపల్ సానిటేషన్ కార్మికులు బల్దియా కార్యాలయంలో మేసమ్మ వద్ద పండుగ జరుపుకున్నారు. సానిటరీ ఎస్సై పర్వేజ్, కార్మికులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్‌లో..



నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట మోడల్ స్కూల్‌లో బోనాల పండుగ నిర్వహించారు. మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ కార్తిక సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భిక్కనూరు మండల కేంద్రంలో..

భిక్కనూరు: మండల కేంద్రంలో మహేంద్ర మ్యాదరి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. మహంకాళి అమ్మవారు, భూలక్ష్మి అమ్మవారు, ఊరడమ్మలకు బోనాలను సమర్పించారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్: మైలారం గ్రామంలో శుక్రవారం కొచ్చెరి మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆషాఢ మాసం సందర్భంగా గ్రామంలో అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

సంక్షిప్తం

కంటివైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. మోతి బిందు సమస్యలున్న వారు శస్త్ర చికిత్స చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

ఎల్లాపూర్ తండాలో ..

రాజంపేట: ఎల్లాపూర్ తండాలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు క్యాంప్ ఆఫీసర్ వినయ్ తెలిపారు. తండాలో ఇంటింటికి వెళ్లి సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించామన్నారు. అదే విధంగా పలువురికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామన్నారు.

పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులు ఇప్పటి నుంచే డబ్బులను పొదుపు చేసుకోవడం అలవాటు చేసుకోవాలని ఎంఈవో రామస్వామి అన్నారు. కృష్ణాజివాడి ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు బ్యాంకు ఖాతాలకు సంబంధించిన బుక్‌లను పంపిణీ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి ఎస్‌బీఐలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 30 మంది విద్యార్థులకు ఖాతాలు తీయించినట్లు తెలిపారు. స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన డబ్బులు ఈ ఖాతాలో పడుతాయన్నారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శివకుమార్ అన్నారు. ఆయన శుక్రవారం దేమికలాన్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, సీనియర్ అసిస్టెంటు హన్మండ్లు, తదితరులున్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం కంఠాలి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్థానిక ఎస్సై నవీన్ చంద్ర టై బెల్టులను అందజేశారు. ఒకటి నుంచి 7వ తరగతి విద్యార్థులకు ఎస్సై సొంత డబ్బులతో టై, బెల్టులు, బ్యాడ్జీలను పంపిణీ చేశారు.

సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం నుంచి పోస్టాఫీసు వరకు చేపడుతున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ సూచించారు. శుక్రవారం ఆయన సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. నేతలు ఎల్లమయ్య, అశోక్, సాయిరాం, రాజు, రవి పాల్గొన్నారు.

ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలి

బాన్సువాడ రూరల్: లేబర్‌కార్డు కలిగిన క్లెయిమ్‌లను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐటీయూసీ నేతలు దుబాస్‌రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన బాన్సువాడ సీపీఐ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్‌ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాసే కుట్రలను తిప్పికొడతామన్నారు. ప్రభుత్వం జిల్లా స్థాయిలో భవన నిర్మాణ కార్మిక నాయకులతో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. నెలకు రూ.5వేల ఫించన్ ఇవ్వాలని కోరారు. నాయకులు కమ్మరి రాములు, సాయిలు, హన్మాండ్లు, బాలయ్య పాల్గొన్నారు.